# బాలికను చదివిద్దాం.. దేశాన్ని బలోపేతం చేద్దాం

**రక్షాబంధన్ సందర్భంగా కలెక్టర్, అధికారులకు రాఖీలు కట్టిన బాలసదనం బాలికలు**

**బాలికల విద్య, రక్షణ, సాధికారతకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని కలెక్టర్ భరోసా**









**ములుగు ప్రతినిధి, ఆగస్టు 28:(పిసిడబ్ల్యూ న్యూస్):** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ములుగు బాలసదనం బాలికలు జిల్లా కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ శాఖ అధికారులను కలిసి ఆత్మీయంగా రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. "బాలికకు విద్య.. దేశానికి సాధికారత", "బాలికను చదివిద్దాం.. దేశాన్ని బలోపేతం చేద్దాం" అనే సందేశాలతో ప్రత్యేకంగా రూపొందించిన రాఖీలను అధికారులకు కట్టి బాలికల రక్షణ, విద్య, అభివృద్ధి, సాధికారతపై అవగాహన కల్పించారు.ముందుగా బాలసదనం బాలికలు జిల్లా కలెక్టర్‌ను కలిసి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ రాఖీ కట్టారు. అనంతరం అదనపు కలెక్టర్లను, కలెక్టర్ కార్యాలయంలోని వివిధ విభాగాల అధికారులను, సిబ్బందిని కలిసి రాఖీలు కట్టారు. అలాగే పోలీస్ శాఖకు చెందిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను కలిసి రాఖీ కట్టి తమ ఆప్యాయతను చాటుకున్నారు. బాలికలు రాఖీలు కడుతున్న సందర్భంగా అధికారులు వారితో ఆత్మీయంగా మాట్లాడి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అధికారులు బాలికలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. బాలికల సంక్షేమం, రక్షణ, విద్య, ఆరోగ్యం, భవిష్యత్ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాలికలు విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి బాలికకు సురక్షితమైన వాతావరణం, నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, సమాన అవకాశాలు అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**రక్షాబంధన్.. ప్రేమతో పాటు బాధ్యతకు ప్రతీక**

ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి ఈ.పి. ప్రేమలత మాట్లాడుతూ రక్షాబంధన్ పండుగ కేవలం అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమకు మాత్రమే పరిమితం కాదని, పరస్పర బాధ్యత, రక్షణ, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. బాలసదనం బాలికలు రాఖీల ద్వారా సమాజానికి ఎంతో గొప్ప సందేశాన్ని అందించారని పేర్కొన్నారు."ఒక బాలికకు విద్య అందిస్తే ఒక కుటుంబమే కాదు.. సమాజం, దేశం కూడా అభివృద్ధి చెందుతుంది" అనే ఆలోచనను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని ఆమె అన్నారు. బాలికల విద్యను ప్రోత్సహించడం ద్వారా వారికి ఆత్మవిశ్వాసం, స్వావలంబన, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు.ప్రతి బాలికకు విద్యతో పాటు భద్రత, సమాన అవకాశాలు, ఆరోగ్యం, గౌరవప్రదమైన జీవనం కల్పించాల్సిన బాధ్యత కుటుంబం, పాఠశాల, సమాజం, ప్రభుత్వంపై ఉందన్నారు. బాలికలు తమ హక్కులను తెలుసుకుని ఎలాంటి పరిస్థితుల్లోనూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలని సూచించారు.

**బాలసదనం బాలికల భవిష్యత్‌పై ప్రత్యేక శ్రద్ధ**

సంరక్షణ కేంద్రాల్లో ఉన్న బాలికలకు కేవలం ఆశ్రయం కల్పించడం మాత్రమే కాకుండా వారి విద్య, ఆరోగ్యం, మానసిక వికాసం, నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రేమలత తెలిపారు. బాలికలలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే వారు భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోగలరన్నారు.బాలికలపై ఎలాంటి వివక్షకు తావులేకుండా సమాన అవకాశాలు కల్పించాలని, వారి అభిప్రాయాలకు విలువ ఇవ్వాలని, విద్యను మధ్యలో నిలిపివేయకుండా ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలని సూచించారు. బాలికల భద్రతకు సంబంధించిన సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు.అవసరమైన సమయంలో బాలల సహాయవాణి సేవలను వినియోగించుకోవాలని, బాలల రక్షణకు సంబంధించిన ఏ సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాలికల భద్రత, విద్య, సాధికారత విషయంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు.రక్షాబంధన్ సందర్భంగా బాలసదనం బాలికలు అధికారులకు రాఖీలు కట్టి "మమ్మల్ని కాపాడటమే కాదు.. మమ్మల్ని చదివించి, భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగడానికి తోడ్పడండి" అనే సందేశాన్ని వినూత్నంగా చాటారు. ఈ కార్యక్రమం బాలికల పట్ల సమాజానికి ఉన్న బాధ్యతను గుర్తు చేసేలా సాగింది.ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా సమన్వయకర్త నరేష్, బాలసదనం సిబ్బంది అరుణ, రాణి, సఖి కేంద్రం సలహాదారు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

---

## అన్నా చెల్లెలు అనుబంధానికి రాఖీ వేడుక

**● అన్నయ్యకు రాఖీ కట్టిన కౌన్సిలర్... ఆత్మీయతే శాశ్వతం**



**కల్లూరు, ఆగస్టు 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కల్లూరు మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్ యాస నాగమణి శ్రీకాంత్ తన అన్నయ్య సోమరాజు సతీష్‌కుమార్‌కు రాఖీ కట్టి సోదరాభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయాల్లో పదవులు పరిమితమైనవేనని, ఆత్మీయత, ఆత్మగౌరవం, అనుబంధాలే శాశ్వతమని పేర్కొన్నారు. రాఖీ పండుగ సందర్భంగా అన్నాచెల్లెళ్లకు శుభాకాంక్షలు తెలిపిన కౌన్సిలర్.. ఒకరినొకరు సోదర, సోదరీ భావంతో గౌరవించుకుంటూ కలకాలం ఆప్యాయంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధులుగా తమపై ఉన్న బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ వార్డు అభివృద్ధికి కలిసి కృషి చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. రక్షాబంధన్ కేవలం రక్త సంబంధాలకే పరిమితం కాదని, ఆప్యాయత, నమ్మకం, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. కుటుంబ బంధాలకు అతీతంగా మనసులను కలిపే అనుబంధమే నిజమైన సోదరభావమని పేర్కొన్నారు. అన్నాచెల్లెళ్ల మధ్య కనిపించిన ఈ ఆత్మీయత స్థానికులను ఆకట్టుకుంది. ప్రజాజీవితంలోనూ మానవీయ విలువలు, పరస్పర గౌరవం, సోదరభావం కొనసాగాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాలు పొంగులేటి యూత్ నాయకులు యాస శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా రాఖీ పండుగ వేడుకలు

**- సోదరీమణులకు కానుకలు అందజేసిన ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం**



**చొప్పదండి ఆగస్టు 28(పిసిడబ్ల్యూ న్యూస్):** నేడు రాఖీ పండుగను పురస్కరించుకుని చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యంకి కరీంనగర్ లోని క్యాంపు కార్యాలయంలో చొప్పదండి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని పలువురు మహిళా కాంగ్రెస్ సోదరీమణులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా రాఖీ కట్టిన సోదరీమణులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక కానుకలు అందజేసి, ఆప్యాయంగా పలకరించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషాన్ని నింపాలని, రాష్ట్ర ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సోదరీమణుల రక్షణ, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, మహిళా సాధికారతే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# రాఖీ బంధం.. ప్రేమకు ప్రతిరూపం



**● అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ఆత్మీయ వారధి రక్షాబంధన్ ● టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు ● సోదరీమణుల రక్షణ, గౌరవం, సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి ● కలెక్టరేట్‌లో రాఖీ కట్టి, మిఠాయిలు అందించిన బ్రహ్మకుమారీలు**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాఖీ అంటే కేవలం మణికట్టుకు కట్టే దారం కాదు.. అన్నాచెల్లెళ్ల మధ్య అనురాగాన్ని, ఆప్యాయతను, పరస్పర విశ్వాసాన్ని ముడివేసే పవిత్ర బంధం. సోదరుడు తన సోదరి రక్షణకు అండగా నిలవాలనే బాధ్యతను గుర్తుచేస్తూ.. సోదరి తన సోదరుడి క్షేమాన్ని కోరుకునే ఆత్మీయతను చాటే అపురూపమైన పండుగ రక్షాబంధన్ అని టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్‌లో బ్రహ్మకుమారీలు ఏలూరి శ్రీనివాసరావుకు రాఖీ కట్టి, మిఠాయిలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రక్షాబంధన్ విశిష్టతను ఆయన వివరించారు. రక్త సంబంధాలకు అతీతంగా ప్రేమ, మానవత్వం, ఆప్యాయతలకు రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

**బంధాలను బలోపేతం చేసే పవిత్ర పండుగ :**

కుటుంబ బంధాలు బలంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటుందని ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమను మరింత గాఢం చేయడంతో పాటు కుటుంబ సభ్యుల మధ్య పరస్పర గౌరవం, విశ్వాసం, ఆప్యాయతలను పెంపొందిస్తుందని చెప్పారు. నేటి ఉరుకులు పరుగుల జీవితంలో దూరమవుతున్న కుటుంబ విలువలను తిరిగి గుర్తుచేసే గొప్ప సందర్భం రక్షాబంధన్ అని తెలిపారు.

**మహిళల గౌరవమే సమాజ ప్రగతికి పునాది :**

సోదరీమణుల రక్షణ అంటే కేవలం ప్రమాదాల నుంచి కాపాడటం మాత్రమే కాదని, వారికి సమాన గౌరవం, స్వేచ్ఛ, భద్రత, అవకాశాలు కల్పించడమని ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. మహిళలు భయపడకుండా, ఆత్మవిశ్వాసంతో జీవించే సురక్షితమైన వాతావరణాన్ని సృష్టించడం కుటుంబం, సమాజం మొత్తానికి బాధ్యత అని పేర్కొన్నారు. మహిళల హక్కులు, భద్రత, విద్య, ఉపాధి, సాధికారత కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోదరీమణు లను గౌరవించడం, వారి అభిప్రాయాల కు విలువ ఇవ్వడం, వారి ఎదుగుదలకు అండగా నిలవడం ప్రతి సోదరుడి బాధ్య త మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అన్నారు.

**రాఖీ దారంలో దాగిన మానవీయ సందేశం :**

రక్షాబంధన్ కేవలం ఒక కుటుంబ పండుగగా కాకుండా.. సమాజంలో ప్రేమ, సోదరభావం, పరస్పర సహకారం, మానవీయ విలువలను పెంపొందించే పండుగగా మారాలని ఆకాంక్షించారు. ఒకరి పట్ల ఒకరు అండగా నిలవడం, కష్టాల్లో తోడుగా ఉండటం, ఆపదలో ఆదుకోవడం, ఆనందాన్ని పంచుకోవడం వంటి గొప్ప విలువలను రాఖీ మనకు గుర్తుచేస్తుందని చెప్పారు.రాఖీ కట్టే ఆ చిన్న దారంలో పెద్ద బాధ్యత దాగి ఉందని.. అది ప్రేమకు ప్రతీక, నమ్మకానికి నిదర్శనం, రక్షణకు హామీ, కుటుంబ బంధాలకు చిరునామా అని పేర్కొన్నారు.

ప్రతి ఇంట్లో ప్రేమానురాగాలు వెల్లివిరియాలని, ప్రతి మహిళ గౌరవంగా, ధైర్యంగా, స్వేచ్ఛగా జీవించే సమాజం నిర్మాణం కావాలని ఆకాంక్షించారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్రంలోని మహిళా ఉద్యోగులు, జిల్లా ప్రజలందరికీ ఏలూరి శ్రీనివాసరావు హృదయపూర్వక రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబంలో సుఖసం తోషాలు వెల్లివిరియాలని, అన్నాచెల్లెళ్ల అనుబంధం చిరకాలం వర్ధిల్లాలని, ప్రజలందరూ ఆయురారో గ్యాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. టీజీవో జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి కొణదన శ్రీనివాసరావు, టీఎన్జీవో మాజీ జిల్లా అధ్యక్షులు పొట్టపింజర రామయ్య, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కె. దుర్గాప్రసాద్, తెలంగాణ మైనారిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అస్లాం, బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఏవో చంద్రశేఖర్ కళ్యాణ్, బ్రహ్మకుమారీలు రాజయోగిని, బీకే అరుణ, బీకే గీత తదితరులు పాల్గొన్నారు.

